హైదరాబాద్ వార్త



# తెగ వాడేస్తున్నారు..!

-ఎండలు సుర్రున ..
మీటరు గిర్రున
-సూర్యుని ధాటికి
విలవిల్లాడుతున్న
నగరవాసులు
-ఇప్పటికే 75ఎంయూలకు
చేరిన విద్యుత్ వినియోగం
-మే నాటికి 100మిలియన్
యూనిట్లకు చేరే అవకాశం



**హైదరాబాద్, మార్చి 17,ప్రభాతవార్త:** భానుడి భగభగలతో గ్రేటర్ జోన్‌లో విద్యుత్ వినియోగం రికార్డు స్థాయిలో పెరుగుతంది. గ్రేటర్ జోన్ పరిధిలో గత నెలరోజులుగా విద్యుత్ వినియోగం 65 నుంచి 70 మిలియన్ యూనిట్లు (ఎంయూ)లకు ఉండగా ఇప్పుడు అత్యధికంగా 75-80 మిలియన్ యూనిట్లకు చేరింది.. గత సంవత్సరం మార్చిలో 65 ఎంయూలు నమోదైతే ఈసంవత్సరం 75ఎంయులకు చేరింది. గత నెలతో పోలిస్తే ఉష్ణోగ్రతలు రికార్డు స్థాయిలో నమోదవువుండటంతో విద్యుత్ వినియోగం మరింత పెరుగుతందని తెలంగాణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (టిఎస్ఎస్‌పీడీ సీఎల్) అధికారులు తెలుపుతున్నారు. వినియోగం రికార్డు స్థాయిలో నమోదవుతున్న నేపథ్యంలో 220 సబ్ స్టేషన్‌ల పనితీరు, డిమాండ్, సప్లైలపై ప్రతి రోజూ ఉన్నతాధికారులు సమీక్షా సమావేశాలు నిర్వహిస్తున్నారు. అయితే మేచివరి వరకు వాతావారణం ఉష్ణోగ్రతలు ఇలానే ఉండవచ్చునని వాతవరణ అధికారులు తెలుపుతున్న నేపథ్యంలో విద్యుత్ వినియోగం ఇంకా పెరిగే అవకాశం ఉందని ట్రాన్స్‌ఫార్మర్లపై లోడ్ పడకుండా పలు ప్రాంతాల్లో మొబైల్ ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేసినట్లు విద్యుత్ అధికారులు తెలుపుతున్నారు.

**గృహాలు కార్యాలయాల్లో పెరిగిన విద్యుత్ వాడకం..**

డిమాండ్ ఏస్థాయిలో పెరిగిన సబ్‌స్టేషన్లలో సాంకేతిక సమస్యలు తలెత్తకుండా ఏజీకాలనీలోని స్కాడా భవనం నుంచి ఆపరేషన్ అధికారులు నిరంతరం సర్కిళ్ల వారీగా నమోదవుతున్న విద్యుత్ వినియోగంపై దృష్టి కేంద్రీకరించారు. హైదరాబాద్ సెంట్రల్ సౌత్, సైబర్ సిటీ, సికింద్రాబాద్, బంజారాహిల్స్, రంగారెడి ఈస్ట్, వెస్ట్,నార్త్ సర్కిళ్ల పరిధిలో విద్యుత్ వినియోగం క్రమంగా పెరుగుతుంది. గ్రేటర్ జోన్‌లో సాధారణంగా 60-65 ఎంయూలు నమోదవుతుంది. ఉష్ణోగ్రతలు పెరుగుతున్న నేపథ్యంలో గృహాలు ఆఫీసులు,ప్రైవేట్ కంపెనీల్లో ఏసీలు, కూలర్ల వినియోగం భారీగా పెరిగిందని అధికారులు చెబుతున్నారు. మధ్యాహ్నం ఒకటి నుంచి సాయంత్రం 5వరకు విద్యుత్ డిమాండ్ ఎక్కువగా నమోదవుతోందని ఆపరేషన్ అధికారులు పేర్కొంటున్నారు. ఉష్ణోగ్రతలు బట్టి వినియోగంలో మార్పు చోటుచేసుకుంటు న్నాయని వినియోగం ఇలానే పెరిగితే అది నాలుగువేలు దాటే అవకాశం ఉందన్నారు.

**ఏసీలు వాడకం పెరగడం..**

నగరం అసలే కాం క్రీట్ మయం..ఏటికేటికి నిర్మాణాలు పెరుగుతుండటంతో అభివృద్ధి పేరిట పచ్చధనం కనుమరుగవతుంది. ఈనేపథ్యంలో ఉష్ణోగ్రతల పెరుగుదల కన్పిస్తుది. చెట్ల సంఖ్య తగ్గడతో చల్లధనం కోసం కూలర్లు, ఏసీలు వాడితే తప్ప వేసవి వేడి నుంచి ఉపశమనం పొందే వాతావరణం లేదు. ఇవన్నీ కరెంట్ వాడకం పెరిగేందుకు కారణమే. వినియోగం దారులు పెరగడం, నగరం విస్తరించడం, ఏటా ఏసీలు వాడే వారి సంఖ్య వంటి కారణాలు విద్యుత్ డిమాండ్‌ను పెంచేస్తున్నాయి.

## క్షణాల్లో కారు చోరీ....

**పంజగుట్ట, మార్చి 17 ప్రభాతవార్త:** షాపుముందు నిలిపిన కారును క్షణాల్లో మాయం చేసిన సంఘటన పంజగుట్ట పోలీసు స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..బేగంపేట లోని రిలాక్స్ వైన్ షాప్ వద్దకు మద్యం కోసం వైన్ షాప్ ముందు కారును పార్క్ చేయడం జరిగింది. షాపులోకి వెళ్ళి మద్యం కొనుగోలు చేసి బయటకు వచ్చే సరికి నిలిపి ఉన్న కారు మాయంఅయింది. పార్క్ చేసిన ఎంజీ హెక్టర్ కారును అగంతకుడు ఎత్తుకు వెళ్ళిపోయాడు. వెంటనే కారు యజమాని ఈ విషయమై పంజగుట్ట పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని సీసీ ఫుటేజీని పరిశీలించారు. కేసునమోదు చేసుకుని పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## జూబ్లీహిల్స్‌లో కారు బీభత్సం

**పంజగుట్ట, మార్చి 17 (ప్రభాతవార్త):** అతివేగంగా కారు నడుపుతూ ప్రమాదానికి కారణమైన కారు యజమానిపై జూబ్లీహిల్స్ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం...సోమవారం క్రిష్ణానగర్ వైపు నుండి జూబ్లీహిల్స్ చెక్‌పోస్ట్ వైపునకు ఓ కారు అతివేగంగా వచ్చి మెట్రోపిల్లర్ను ఢీకొట్టింది. దీంతో కారు ధ్వంసమైంది. కారు రోడ్డకు అడ్డంగా నిలిచిపోయింది. దీంతో సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని రోడ్డుకు అడ్డంగా ఉన్న కారును తొలగించారు. ఘటనలో కారు నడుపుతున్న వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. వెంటనే చికిత్స నిమిత్తం అతనిని ఆసుపత్రికి తరలించారు. మద్యం మత్తులో కారు అతివేగంగా నడిపినట్లు పోలీసులు ప్రాథమికంగా నిర్ధారణకు వచ్చారు. జూబ్లీహిల్స్ పోలీసులు కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## నీటి సంపు శుభ్రం చేస్తూ బిటెక్ విద్యార్థి దుర్మరణం

**ఉప్పల్, మార్చి 17 ప్రభాతవార్త :** నీటి సంపు శుభ్రం చేస్తూ ఊపిరి ఆడక బిటెక్ చదువుతున్న ఒక విద్యార్థి దుర్మణం చెందిన సంఘటన మేడిపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పీర్జాదిగూడ, బుద్దానగర్‌లో నివాసం ఉంటున్న తల్లితో కలిసి ఉంటున్న గణేష్ (19) పల్లవి ఇంజనీరింగ్ కళాశాలలో బిటిక్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. అయితే ఇంటి యజమాని శ్రీహరికి మల్లికార్జుననగర్, బుద్దానగర్‌లో రెండు ఇండ్లు ఉన్నాయి. అయితే ఆదివారం మల్లికార్జుననగర్‌లోని ఇంటి సంపు క్లీనింగ్ కోసం గణేష్‌ను తీసుకెళ్లాడు. అందులోకి క్లీనింగ్ చేసేందుకు సంపులోకి దిగగా, అప్పటికే అందులో యాసిడ్, బ్లీచింగ్ పౌడర్ వేసి ఉండదంతో ఊపిరి ఆడక గణేష్ మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. దీనిపై మేడిపల్లి పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## ఆర్టీసీ బస్సు ఢీకొని విద్యార్థి మృతి

**ఉప్పల్, మార్చి 17 ప్రభాతవార్త :** ఆర్టీసీ బస్సు ఢీకొని ఒక విద్యార్థి మృతి చెందిన సంఘటన ఉప్పల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కాచివాని సింగారం గ్రామం కాంతిదీప కాలనీకి చెందిన పరై గోపి కుమారుడు అక్షిత్, అతని తన్న కొడుకు అభిలాష్‌లు ఇద్దరు స్కూటీ వాహనంపై కాచివాని సింగారం నుంచి పీర్జాదిగూడ వైపు వెళుతుండగా, పోచమ్మ ఆలయం వద్దకు రాగానే పీర్జాదిగూడ నుంచి కాచివాని సింగారం వెళ్లే ఆర్టీసీ బస్సు తగలి వెనుక కూర్చుని ఉన్న అక్షిత్ (13) తల టైర్‌కు తగిలి అక్కడికక్కడే మృతి చెందినట్లు తెలిపారు. దీంతో అతని మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించి మేడిపల్లి పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## ఆపద మిత్ర వలంటీర్ల పాత్ర ఎంతో కీలకం : కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి



మారేడ్‌పల్లి పభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఆపద మిత్రా సదను స్‌లో ప్రసంగిస్తున్న జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తదితరులు

**కంటోన్మెంట్,మార్చి 17 ప్రభాతవార్త:** వాతావరణ మార్పుల వల్ల విపత్తులు సంభవించినప్పుడు ఆస్తి,ప్రాణ నష్టం సంభవించకుండా అలాగే ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించడంలో ఆపద మిత్ర వాలెంటీర్ల పాత్ర ఎంతో కీలకమైందని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అను దీప్ దురిశెట్టి తెలిపారు. సోమ వారం సికింద్రాబాద్ మారేడ్‌పల్లి లోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలోని ఆడిటోరియంలో జిల్లా యువజన, క్రీడల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన 5వ ఆపద మిత్ర వాలంటీర్ల ఓరియెంటేషన్ శిక్షణ ప్రారంభోత్సవ వేడుకలకు ఆయన ముఖ్య అతిధిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం 2005లో జాతీయ విపత్తు నివారణ చట్టం ఇచ్చిందన్నారు. ఆపద మిత్ర శిక్షణ ద్వారా ప్రత్యేక శిక్షణ పొంది విపత్తులు సంబవించినప్పుడు చురుకైన పాత్ర పోషించా లన్నారు. శిక్షణ పొందిన వారు ప్రజలకు సహకారాలు అందించాలన్నారు. ఈ శిక్షణా ఈ నెల 28వ వరకు కొనసాగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ జిల్లా యువజన,క్రీడల అభివృద్ధి అధికారి ఎన్.సుధాకర్ రావ్, సికింద్రాబాద్ ఆర్‌డిఓ సాయిరాం, పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ అన్నపూర్ణ, అర్జున్ అవార్డు గ్రహిత అనూప్ తదితరులు పాల్గొన్నారు.

## హిందూ స్మశాన వాటికను రక్షిస్తాం : ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి



స్మశాన వాటికలో ఎమ్మెల్యే

**అల్వాల్, మార్చి 17 ప్రభాతవార్త:** మచ్చబొల్లారం హిందూ స్మశాన వాటికను రాంకీ కబంద హస్తాలు నుంచి రక్షించే వరకు విశ్రమించేది లేదని మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి స్పష్టం చేశారు. స్మశాన వాటిక వద్ద ఆందోళన చేస్తున్న స్థానికులుతో కలిసి చర్చించారు. స్మశాన వాటిక కోసం కేటాయించిన స్థలాన్ని ప్రైవేటు సంస్థ అయిన రాంకీ ఎలా వాడుతుందని ఆయన ప్రశ్నించారు. ఎటువంటి అనుమతులు లేవని పేర్కొన్నారు. నిబంధనలను తుంగలో తొక్కి ట్రాన్సిస్ట్ పాయింట్‌ను డంపింగ్ యార్డ్‌గా మార్చారని తెలిపారు. దాతలు స్మశాన వాటిక కోసం ఇచ్చిన ప్రతి అంగులం భూమిని కాపాడుకుంటామని తెలిపారు. ప్రజారోగ్యాన్ని కూడా లెక్క చేయకుండా రాంకీ వ్యవహరిస్తోందని ఇందులో జిహెచ్‌ఎంసి పాత్ర స్పష్టమని పేర్కొన్నారు. స్థానిక ప్రజలు అనారోగ్యాలకు గురవుతున్నారని స్వయంగా తాను సంబంధిత యాంత్రాంగానికి విన్నవించినా ఫలితం లేకుండా ఉందన్నారు. రెవెన్యూ యంత్రాంగం తక్షణం రికార్డులను పరిశీలించి మొత్తం స్థలాన్ని స్మశాన వాటికి కోసం వినియోగించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. ప్రజలు ఆందోళన నేపథ్యంలో ఎటువంటి అపశృతులు తలెత్తకుండా పేట్‌బషీర్‌బాద్ ఎసిపి రాములు, సిఐ రాహుల్ దేవ్‌ల పర్యవేక్షణలో బందోబస్తును ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ శాంతి శ్రీనివాస్ రెడ్డి నేతలు డోలి రమేష్, పరమేష్, శోభన్, ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.

## హైడ్రా ప్రజావాణికి 59 ఫిర్యాదులు




ఫిర్యాదులను పరిశీలిస్తున్న కమిషనర్ రంగనాథ్

**హైదరాబాద్, మార్చి 17,ప్రభాతవార్త:** ప్రభుత్వ స్థలాలే కాదు.. నాలా, రహదారి అనేది తేడా లేకుండా ఆక్రమణలకు పాల్పడుతున్నారని హైడ్రాకు ఫిర్యాదులు వస్తున్నాయి. నాలా, రహదారి వద్ద ఏమాత్రం అవకాశం ఉన్న అడుగు జాగాను కూడా కబ్జా చేసి నిర్మాణాలు చేపడుతున్నారని పలువురు పిర్యాదులు అందజేశారు. సంపన్నుల కాలనీలు, సామాన్యులుండే బస్తీలు ఏవీ ఆక్రమణలకు అతీతం కాదని హైడ్రాకు వచ్చిన ఫిర్యాదులు చెబుతున్నాయి. సోమవారం హైడ్రా నిర్వహించిన ప్రజా వాణికి మొత్తం 59 ఫిర్యాదులు అందాయి. ఫిర్యాదులను నేరుగా స్వీకరించడమే కాకుండా అక్కడికక్కడే విచారణ చేపట్టి.. సంబంధిత అధికారులకు వాటి పరిష్కార బాధ్యతలను హైడ్రాకమిషనర్ రంగనాథ్ అప్పగించారు. ప్రభుత్వ భూమితో పాటు ప్రజావసరాలకు ఉద్దేశించిన స్థలాల పరిరక్షణకు అధిక ప్రాధాన్యతను ఇవ్వాలని.. ఎక్కడా కబ్జా కాకుండా చూడాలని హైడ్రా కమిషనర్ అధికారులకు సూచించారు. బంజారాహిల్స్ రోడ్డు నంబరు 12లోని శ్రీ వేంకటేశ్వర కోపరేటివ్ హౌసింగ్ సొసైటీలో ఓపెన్ ప్లేస్ 600 గజాల స్థలంతో పాటు.. తన ఇంటి స్థలాన్ని కూడా కొంతమేర వెనుక వైపు ఉన్న ప్లాట్ యజమాని కబ్జా చేశారని అన్నపూర్ణ అనే మహిళ హైడ్రాకు ఫిర్యాదు అందజేశారు. నాగిరెడ్డి గొలుసు కట్టు చెరువు ఎఫ్‌టీఎల్ పరిధితోపాటు.. నాలాను, బఫర్ జోన్‌లో అక్రమ కట్టడాలు వెలుస్తున్నాయని యాప్రాల్ జాయింట్ యాక్షన్ కమిటీ ఫిర్యాదు చేసింది. ఈ చెరువుకు రూ. 1.20 కోట్లు పెట్టి ప్రభుత్వం వేసిన ఫెన్సింగ్‌ను తొలగించి బఫర్ జోన్‌లో ప్రహరీ నిర్మిస్తున్నారని.. వెంటనే వాటిని తొలగించాలని హైడ్రాను కోరింది. హయత్‌నగర్ మున్సిపాలిటీ సర్కిల్3 లోని వివేకానందనగర్ కాలనీలో 25 అడుగుల రహదారిని ఆక్రమించి ఏకంగా ఇల్లు నిర్మించేశారని.. గతంలో మున్సిపాలిటీ అధికారులు కూల్చేసినా.. మళ్లీ ఇంటిని నిర్మించేశారని ఫిర్యాదు చేశారు. కేపీహెచ్‌బీ లో ప్రధాన రహదారికి ఆనుకుని ఉన్న సర్వీసు రోడ్డును మొత్తం ఆక్రమించి చిరు వ్యాపారాల పేరిట దందాలు చేస్తున్నారని.. అక్కడ తోపుడు బళ్లపై వ్యాపారాలే కాదు.. శాశ్వతంగా డబ్బాలు పెట్టి మొత్తం రోడ్డును ఆక్రమించేశారని.. దీంతో ఆ మార్గంలో వెళ్లలేని పరిస్థితి ఉందని కేపీహెచ్‌బీ ఫేస్ 1, 2 రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు హైడ్రాకు ఫిర్యాదు చేశారు. సర్వీసు రోడ్డులోని దుకాణాలను తొలగిస్తే కాలనీవాళ్లు ఈ దారులను వినియోగించే అవకాశం ఉంటుందని.. చాలా వరకు ప్రధాన రహదారిపై ట్రాఫిక్‌జామ్‌లు తొలుగుతాయని పేర్కొన్నారు.నార్త్ లాలాగూడలోని స్లమ్‌లో 940 గజాలు ప్రజావసరాలైన పాఠశాల, కమ్యూనిటీ హాల్‌కోసం కేటాయించగా.. అందులో 160 గజాల స్థలం తనదంటూ ఓ వ్యక్తి ఇంటిని నిర్మిస్తున్నారని ఫిర్యాదును స్థానికులు అందజేశారు.

# రూ.లక్షల్లో ఫీజులు.. ఇష్టారాజ్యంగా నిర్ణయాలు

-తల్లిదండ్రుల ఆశలను
సొమ్ము చేసుకుంటున్న
యాజమాన్యాలు
-ఒక్కో విద్యార్థికి
ఏడాదికి రెండున్నర
లక్షల వరకు వసూళ్లు
-పట్టించుకోని
ఇంటర్మీడియట్ బోర్డు



**హైదరాబాద్, మార్చి 17 ప్రభాతవార్త** బోడుప్పల్, కేశవ్‌నగర్‌కు చెందిన ఒక విద్యార్థికి ఇంటర్మీడియట్‌లో చేర్చేందుకు తల్లిదండ్రులు మాదాపూర్‌లోని ఓ కార్పొరేట్ కాలేజీని (రెసిడెన్షియల్) సంప్రదించారు. ఏడాదికి రూ.4లక్షల పీజు అని చెప్పడంతో నోరెళ్లబెట్టాడు. చేసేదేంలేక సమీపంలోని మరో కార్పొరేటర్ యాజమాన్యానికి చెందిన కాలేజీలో సంప్రదించారు. అక్కడ ఏడాదికి ఫస్ట్‌ఇయర్‌కు రూ.3.50లక్షలు, సెకండియర్‌కు రూ.3.60లక్షలు..ఈ ఫీజుకు ఒకే అంటే సీటు ఇస్తామని చెప్పడంతో అవాక్కయ్యారు...ఇది నగరంలో కార్పొరేట్, ప్రముఖ రెసిడెన్షియల్ జూనియర్ కాలేజీల్లో అడ్డగోలుగా వసూలు చేస్తున్న ఫీజుల బాగోతం.లక్షల కొద్దీ ఫీజులు కట్టడం కోసం సతమతం అవుతున్న తల్లిదండ్రుల ఆందోళన..

పదో తరగతి పరీక్షలు ఈనెల 21వ తేదీ నుండి ప్రారంభం కానున్నాయి. పూర్తిఅయిన విద్యార్థులు ఇంటర్మీడియట్ అడ్మిషన్ల కోసం నగరానికి పరుగెడుతున్నారు. అయితే కార్పొరేట్ కాలేజీల్లో సీట్ ముందే బుక్‌చేసుకుంటే కొంత రాయితీ ఇస్తామంటూ..విద్యార్థుల పరీక్షల తర్వాత అడ్మిషన్ కోసం వస్తే అప్పటిలోగా ఫీజులు మరింత పెరుగుతాయంటూ ప్రచారం చేస్తుండడంతో తల్లిదండ్రులను ఆందోళనలోకి నెట్టేసి అధిక ఫీజులను దండుకుంటున్నాయి. ఫలానా కాలేజీలోని, ఫలానా బ్రాంచీలో ఇంటర్మీడియట్ చదివిస్తే జెఇఇలో, ఎంసెట్‌లో మంచి ర్యాంకులు వస్తాయని..తద్వారా బిటెక్ సీటు మంచి కాలేజీలో వస్తుందన్న ఆశతో తల్లిదండ్రులు తమ పిల్లలను కార్పొరేట్, ప్రముఖ ప్రైవేటు కాలేజీల్లో చేర్పేందుకు ఆసక్తి చూపుతున్నారు. ఇంటర్ బోర్డు నిర్ణీత ఫీజుల విధానాన్ని పట్టించుకోవడం లేదు. దీంతో ప్రైవేటు యాజమాన్యాలు ఇష్టారాజ్యంగా వసూలు చేస్తున్నాయి.కార్పొరేట్ కాలేజీలు హాస్టల్ వసతి కలుపుకొని రూ.5లక్షల నుండి 3 లక్షల వరకు తీసుకుంటున్నాయి. నోటీకీ వచ్చిందే ఫీజు అన్నట్లుగా అడ్డగోలుగా నిర్ణయించి రూ.10,500లు అడ్వాన్స్‌గా తీసుకొని రిజిస్ట్రేషన్లు చేసుకుంటున్నాయి. ఆయా కాలేజీల్లో చదివిస్తే తమ పిల్లలకు మంచి చదువు వస్తుందని, మంచి ర్యాంకు వస్తుందన్న ఆశలతో తల్లిదండ్రులు అప్పులు చేసి మరీ అడిగినంత ఫీజు చెల్లిస్తున్నారు.

మరోవైపు నగరానికి చెందిన కొన్ని కార్పొరేట్ విద్యాసంస్థలు అడ్మిషన్ల ప్రక్రియ కొన్ని బ్లాకుల్లో పూర్తిచేసి కొత్త బ్లాక్‌లను ఓపెన్ చేస్తున్నారు. మరి కొన్ని ప్రైవేటు కాలేజీ అడ్మిషన్ల కోసం విద్యార్థుల వివరాలు సేకరించి వారి తల్లిదండ్రులకు ఫోన్లుచేసి బంగారు భవిష్యత్తు అందిస్తామంటూ ప్రలోభాలకు గురి చేస్తున్నాయి. ఒక్కసారి కాలేజీని సందర్శించంటూ పదే పదే ఫోన్లు చేయించడం మాములుగా మారింది.ఎంసెట్, జెఇఇ, నీట్ విద్యార్థుల కోసం కళాశాలలు ఏజెంట్లను కూడా నియమించుకుని వారి ద్వారా విద్యార్థుల తల్లిదండ్రులను ఫోన్లలో సంప్రదించడం, కలవడం, అడ్మిషన్లు బుక్ చేసుకోవడం,పసందైన వంటకాలతో రుచిచూపించడం లాంటి కార్యకలాపాలు ప్రారంభించాయి. తమ విద్యాసంస్థలో ముందుగా చేరితే ఫీజులో రాయితీ ఇస్తామంటూ ఆఫర్లు ప్రకటిస్తున్నాయి.అయితే ఇంటర్‌మీడియట్ మొదటి సంవత్సరం అడ్మిషన్ల కోసం వరుసగా వస్తున్న ఫోన్లు, ఎస్ఎంఎస్‌లతో తల్లిదండ్రులు విసుపోతున్నారు. అయితే ప్రతిఏటా నగరంలో వేల సంఖ్యలో విద్యార్థులు కార్పొరేట్ విద్యాసంస్థలో చదువుకుంటుండగా..మళ్లీ తల్లిదండ్రులు తమ పిల్లలను కార్పొరేట్ కళాశాలల్లో చేర్పేందుకు ఆసక్తి చూపుతున్నారు. ఒక్కసారి కాలేజీని సందర్శించండంటూ పదే పదే టెలికాలర్స్ ద్వారా ఫోన్లు చేయించడం మామూలుగా మారింది. 2025-26 విద్యా సంవత్సరానికి అడ్మిషన్ల నోటికేషన్ విడుదల కాకుండానే అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభించవద్దని ఇటీవల ఇంటర్మీడిఎట్ బోర్డు హెచ్చరికలు జారీ చేసినా వాటిని పట్టించుకునేవారు లేకుండా పోవడం గమనార్హం.దీంతో తల్లిదండ్రుల ఆశలను సొమ్ము చేసుకుంటున్న యాజమాన్యాలను చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

# ఓయూలో ఆందోళనల నిషేదంపై ఉద్రిక్తత

-22 మందిని అరెస్టు
చేసిన పోలీసులు



ఓ.యూలో అరెస్టు చేసి ఓ.యూ పిఎస్‌కు తరలిస్తున్న పోలీసులు

**తార్నాక, మార్చి 17 ప్రభాతవార్త :** ఉస్మానియా యూనివర్సిటీలో అన్ని రకాల ఆందోళనలను నిషేధిస్తూ అధికారులు సర్క్యులర్ విడుదల చేసిన నేపథ్యంలో ఓయూలో సోమవారం తీవ్ర ఉద్రిక్తత కొనసాగింది. పలువురిని ఉదయమే హాస్టళ్లలో అదుపులోకి తీసుకొని స్టేషన్‌కు బలవంతంగా తరలించారు. ప్రత్యేక తెలంగాణ ఉద్యమ సమయంలో అప్పటి సమైక్యాంధ్ర ప్రభుత్వం ఓయూను పోలీసు క్యాంపు గా మార్చి వేసినట్లుగా ప్రస్తుతం సైతం క్యాంపస్ పోలీసు క్యాంపుగా మారిపోయిందని విద్యార్థులు పేర్కొన్నారు. పరిపాలన భవనం గేటు వద్ద పోలీసులు, మరోవైపు పదుల సంఖ్యలో ఓయూ సెక్యూరిటీ సిబ్బందిని మోహరించారు.. ఉస్మానియా యూనివర్సిటీ విద్యార్థి సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో మెయిన్ లైబ్రరీ నుండి ఆర్ట్స్ కళాశాల వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఆర్ట్స్ కళాశాల ఆవరణలో నిరసన ప్రదర్శన నిర్వహించిన అనంతరం లా కళాశాల ఆవరణలోని అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పించేందుకు వెళ్తుండగా పోలీసులు అడ్డుకున్నారు. ఈ క్రమంలో విద్యార్థులు ఓయూ వీసీ, ప్రభుత్వం, పోలీసులకు వ్యతిరేకంగా నినదించారు. ఈ నేపథ్యంలో ఇరుపక్షాల మధ్య తీవ్ర తోపులాట చోటుచేసుకుంది. అక్కడ ఉన్న విద్యార్థి నాయకులను అందర్నీ పోలీసులు బలవంతంగా అదుపులోకి తీసుకొని అంబర్‌పేట్, నల్లకుంట పోలీస్ స్టేషన్ లకు తరలించారు. ఈ సందర్భంగా విద్యార్థి నాయకులు మాట్లాడుతూ యూనివర్సిటీలను నిర్వీర్యం చేసే కుట్ర సీఎం రేవంత్ రెడ్డిదని ఆరోపించారు. వర్సిటీలో విద్యార్థులను భయభ్రాంతులకు గురి చేసే పని ప్రభుత్వం చేస్తోందని మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీ ఇకనైనా కక్షపూరిత రాజకీయ పాలన మానుకోవాలని సూచించారు. తమ హక్కుల కోసం పోరాడే విద్యార్థులను అణగదొక్కేందుకు ప్రభుత్వం పోలీసులను అడ్డుపెట్టుకొని నిర్బంధం చేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు జారీ చేసిన సర్క్యులర్ ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. వైస్ ఛాన్సలర్ ఎం.కుమార్ తీరు నియంతృత్వ పోకడలతో ఉన్నదని మండిపడ్డారు. తెలంగాణ ఉద్యమం మొదలు అనేక ప్రజాస్వామ్య ఉద్యమాలకు ఓయూ వేదికగా ఉన్నదని గుర్తు చేశారు. విద్యార్థులు తమ సమస్యల పరిష్కారానికి, రాజ్యాంగం కల్పించిన హక్కుల అమలుకు ఉద్యమాలు నిర్వహిస్తారనే కనీస అవగాహన లేకుండా సర్క్యులర్ జారీ చేయడం అధికారుల అజ్ఞానానికి నిదర్శనమని ఎద్దేవా చేశారు. ఓయూ అభివృద్ధికి, ఓయుకు నిధులు కోసం ఓయూ విద్యార్థి సంఘాలు, ప్రొఫెసర్లు ఉద్యమించడం సాధారణమేనని చెప్పారు. కానీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ కుమార్ మాత్రం విద్యార్థుల సంక్షేమం గాలికొదిలి, యూనివర్సిటీ అస్తిత్వానికి వ్యతిరేకంగా విద్యార్థులపై చెత్త నిర్ణయాలు రుద్దాలని చూస్తున్నారని దుయ్యబట్టారు. దివ్యాంగ విద్యార్థులు తమ సమస్యలు పరిష్కరించాలని ఆందోళన చేస్తే, వారిని అమానుషంగా అరెస్టు చేయించి, కేసులు నమోదు చేశారని వాపోయారు. రాష్ట్ర ముఖ్యమంత్రి, ప్రభుత్వ పెద్దలు ఈ అంశంపై తక్షణమే స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. మరో వైపు కేవలం 22 మందిని మాత్రమే అదుపులోకి తీసుకున్నట్లు ఇన్స్‌పెక్టర్ రాజేంద్రనాయక్ పేర్కొన్నారు.

## రహ్మత్‌నగర్ చౌరస్తాలో ఆక్రమణలు తొలగింపు



రహమత్‌నగర్ చౌరస్తాలో జేసీబీతో ఆక్రమణలను తొలగిస్తున్న టౌన్‌ప్లానింగ్ సిబ్బంది.

**యూసుఫ్‌గూడ, మార్చి 17, ప్రభాతవార్త :** నిత్యం వాహనాల రాకపోకలతో రద్దీగా ఉండే రహమత్‌నగర్ చౌరస్తా రహదారులు ఇరుకుగా మారాయి. చౌరస్తాలోని ఓ మద్యం దుకాణం ఆనుకుని డబ్బాలు ఏర్పాటు చేయడంతో రహదారి కాస్త కుషించుకుపోయింది. ఆర్టీసి బస్సులతో పాటు ప్రవేటు వాహనాలకు అటుగా వెళ్ళాలంటే గంటల కొద్ది ఉదయం సాయంత్రం వేళల్లో ట్రాఫిక్ అంతరాయం ఏర్పడుతుంది. చౌరస్తాలోని రోడ్డు ఆక్రమణ వలన ప్రజలు పడుతున్న ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని గత కొంత కాలంగా జిహెచ్ఎంసి అధికారులకు ట్రాఫిక్ పోలీసులకు స్థానిక కార్పొరేటర్ సిఎన్‌రెడ్డి పలు మార్లు వినతీ పత్రాలు ఇవ్వడం జరిగింది. దీనితో చౌరస్తాలో ఉన్న మద్యం దుకాణం వలన ప్రయాణికులతో పాటు సామాన్య ప్రజలకు ఎన్నో ఇబ్బందులు ఉన్న నేపథ్యంలో సోమవారం టౌన్‌ప్లానింగ్ అధికారులు పోలీసుల బందోబస్తు నడుమ జేసిబీతో ఆక్రమణలను తొలగించడం జరిగింది. ప్రజలకు రాకపోకలకు ఇబ్బందులుగా మారిన బడ్డీ కొట్లను దుకాణా లను స్వచ్ఛందంగా తొలగించాలని కార్పోరేటర్ కోరారు. ఇందులో పట్టణ ప్రణాళిక విభాగం ఎసిపి ప్రసీద, శిక్షణ ఆఫీసర్ నరేష్, మధురానగర్ ఇన్స్‌పెక్టర్ శ్రీనువాస్, సిబ్బంది ఎస్ఆర్‌నగర్ ట్రాఫిక్ పోలీసులు పాల్గొన్నారు.

## వేసవిలో నీటి సమస్య నివారణకు కృషి



**మల్కాజిగిరి మార్చి17, ప్రభాతవార్త :** మల్కాజ్గిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి ఆదేశాల మేరకు గౌతంనగర్ డివిజన్లోని అన్ని కాలనీలో వేసవికాలంలో నీటి సమస్య నివారణకు చర్యలు తీసుకుంటున్నామని గౌతమ్ నగర్ డివిజన్ కార్పొరేటర్ మేకల సునీత రాము యాదవ్ పేర్కొన్నారు. సోమవారం ఆమె గౌతమ్ నగర్ డివిజన్ పరిధిలోని ఇందిరా నెహ్రూ నగర్ మరియు ఈస్ట్ ఇందిరా నెహ్రూ నగర్ తదితర ప్రాంతాలలో పర్యటించారు. ఈ సందర్భంగా గత కొంతకాలంగా పవర్ బోరు కు సంబంధించిన నీటి వాల్స్ పాలైపోవడంతో నీటి సరఫరా ఇబ్బందిగా ఉందని ఆయా కాలినైన వాసులు కార్పొరేట్ దృష్టికి తీసుకెళ్లారు స్పందించిన కార్పొరేటర్ 10 నీటి వాల్స్ వరమత్తులకు సొంత నిధులు ఇచ్చి మరమ్మతులు చేయిస్తానని ప్రజలకు హామీ ఇచ్చారు ఈ కార్యక్రమంలో నాయకులు మేకల రాములు, భైరు అనిల్, సిద్ధిరాములు, నరహరి రావు, నగేష్ గౌడ్, మల్లేష్ యాదవ్, మర్రి శీను, సూర్య ప్రకాష్, శ్రీను, శశి, హబీబ్, పద్మ, శైలజ, లక్ష్మి నాయకులు పాల్గొన్నారు.

## ఓపెన్ జిమ్‌లను ఉపయోగించుకోవాలి : కార్పొరేటర్



ఎస్.కె.డి.నగర్ పార్కులో ఓపెన్ జిమ్ పరికరాలను పరిశీలిస్తున్న కార్పొరేటర్ లచ్చిరెడ్డి.

**వనస్థలిపురం. మార్చి.17, ప్రభాతవార్త**

బి.యన్ రెడ్డి నగర్ డివిజన్ పరిధిలోని ఎస్కెడి నగర్ పార్కులో 12,లక్షల రూపాయలతో అభివృద్ధి చేసిన ఓపెన్ జిమ్ ను సోమవారం బి.యన్ రెడ్డి నగర్ డివిజన్ జిహెచ్ఎంసి కార్పొరేటర్ మొద్దు లచ్చి రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ ఎస్కెడి నగర్ పార్కులో 12 లక్షల రూపాయలతో అభివృద్ధి చేసిన ఓపెన్ జిమ్ పరికరాలను జిహెచ్ఎంసి ఇంజనీరింగ్ విభాగం ఏ ఈ రాజ్ కుమార్ ,కాలనీ వాసులతో కలిసి పర్యవేక్షించారు. త్వరలోనే కాలనీలోని ప్రతి సమస్య పరిష్కారమయ్యే విధంగా చర్యలు చేపడుతామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కాలనీ ప్రధాన కార్యదర్శి సుధాకర్ రెడ్డి, లక్ష్మీనరసింహస్వామి ఆలయ వైస్ చైర్మన్ శ్రీధర్ రావు, అమరేందర్ రెడ్డి, ప్రభాకర్, శ్రీనివాస్ రావు, కృష్ణ రావు, పవన్ మరియు నాయకులు మహేష్ గౌడ్, జిహెచ్ఎంసి వర్క్ ఇన్స్పెక్టర్ శ్రీకాంత్ తదితరులు ఉన్నారు.

## హస్తినాపురం డివిజన్‌లో అభివృద్ధి ఆగదు



శివ సాయి నగర్‌లో సి.సి.రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న కార్పొరేటర్ సుజాత నాయక్

**వనస్థలిపురం మార్చి.17.ప్రభాతవార్త :** ఎవరు ఎన్ని అడ్డంకులు సృష్టించిన హస్తినాపూర్ డివిజన్ అభివృద్ధి ని ఆపలేరని జిహెచ్ఎంసి స్టాండింగ్ కమిటీ మెంబర్ హస్తినాపురం కార్పొరేటర్ బానోతు సుజాత నాయక్ అన్నారు. హస్తినాపూర్ డివిజన్ పరిధిలోని శివ సాయి నగర్ కాలనీలో 25 లక్షలతో చేపడుతున్న సిసి రోడ్డు పనులకు శంకుస్థాపన చేసి అట్టి పనులను వెంటనే ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డ తర్వాత కొందరు నాయకులకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని గతంలో అనేకమార్లు డివిజన్ కు అవసరం ఉన్న నిధులు మంజూరు చేయకుండా ప్రజాప్రతినిధులను ఇబ్బందులు గురి చేశారని అన్నారు. ఇప్పుడు ఆ లాంటి పరిస్థితి లేదని అభివృద్ధి లక్ష్యంగా ముందుకు వెళుతున్నట్లు తెలిపారు. ఏ సమస్య ఉన్న తన దృష్టికి వచ్చిన వెంటనే పరిష్కరిస్తున్నట్లు తెలిపారు. దినదిన అభివృద్ధి చెందుతున్న హస్తినాపూర్ డివిజన్‌ను అన్ని విధాలుగా అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు గోవర్ధన్ రెడ్డి గోపాల్ రెడ్డి గంగాధర్ హనుమంత్ రెడ్డి మమతా మల్లేష్ గౌడ్ గోపిరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు

## పేద జంటలకు ఉచితంగా వివాహాలు : జగిని శ్రీనివాస్



పేద జంటలకు వివాహం జరిపిస్తున్న జగని శ్రీనివాస్, నాగమల్ల అనిల్ కుమార్ తదితరులు

**మలక్ పేట ,మార్చి 17, ప్రభాతవార్త:** పేద జంటలకు ఉచితంగా వివాహాలు జరిపిస్తున్నామని జగనీ ఫర్నిచర్స్ నిర్వాహకులు జగని శ్రీనివాస్, నాగమల్ల అనిల్ కుమార్ లు పేర్కొన్నారు. మలక్ పేట ఎస్బిహెచ్ కాలనీ కమ్యునిటీ హాల్లో జగనీ ఫర్నిచర్స్ నిర్వాహకులు జగని శ్రీనివాస్, నాగమల్ల అనిల్ కుమార్ ల ఆధ్వర్యంలో రెండు పేద బధిర జంటలకు ఘనంగా వివాహాలను జరిపించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కుల, మతాలకు అతీతంగా ఆర్థికంగా వెనుకబడిన నిరుపేద వధూవరులకు తమ స్వంత ఖర్చులతో వివాహాలు జరిపిస్తామని వివరించారు. ఆర్థిక స్తోమత లేని వారు ఎవరైనా తమను సంప్రదిస్తే అంగరంగ వైభవంగా శాస్త్రోక్తంగా వివాహాలను జరిపిస్తామని వివరించారు. సమాజానికి తమ వంతు సేవలు అందిస్తున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎడవల్లి బాలరాజ్, విజయ్ కుమార్, నరసింహారావు, నీలా వెంకటేష్, సురేష్, మల్లికార్జున్ పాల్గొన్నారు.

## దిల్‌షుక్‌నగర్ ఆర్టీసీ డిపోలో డయల్ యువర్ డిఎం

### -డిపో మేనేజర్ సమత

**మలక్ పేట, మార్చి 17 ప్రభాతవార్త :** దిల్ షుక్ నగర్ ఆర్టీసీ డిపోలో డయల్ యువర్ డిఎం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు డిపో మేనేజర్ సమత ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దిల్ షుక్ నగర్ ఆర్టీసీ డిపోలో మంగళవారం సాయంత్రం 4 గంటల నుంచి 5:00 వరకు డయల్ యువర్ డిఎం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని ప్రజలు సెల్ నెంబర్ 9959226137లో సంప్రదించాలని కోరారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రయాణికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రయాణికులు తమ సలహాలు, సూచనలు, ఫిర్యాదులను తమకు తెలియజేయాలని పేర్కొన్నారు.

## సుధీర్‌రెడ్డి కార్పొరేటర్లను చిన్నచూపు చూస్తున్నారు: కొప్పుల నర్సింహారెడ్డి



అభివృద్ధి పనుల శంకుస్థాపనలో కార్పొరేటర్

**హయత్‌నగర్, మన్సూరాబాద్, మార్చి 17 ప్రభాతవార్త:** ప్రజా శ్రేయస్సే తమకు ముఖ్యమని... అభివృద్ధి విషయంలో ఎవరు అడ్డుపడినా ఉపేక్షించేది లేదని మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి అన్నారు. డివిజన్ పరిధిలో 60 లక్షల రూపాయల వ్యయంతో చేపట్టిన సీసీ రోడ్డు, ఓపెన్‌జిమ్‌లను ఆయన సోమవారం ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ... తాను రాజ్యాంగబద్ధంగా ఎన్నుకోబడిన కార్పొరేటర్‌నని, ఎమ్మెల్యే ప్రోటోకాల్ పాటించకుండా ఇటీవల అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయడం సరికాదన్నారు. పైగా తమను రెచ్చగొట్టేలా వ్యాఖ్యలు చేయడం ఏమిటన్నారు. సరస్వతినగర్‌లో కార్పొరేటర్ శంకుస్థాపనలు చేస్తుండగా బీఆర్ఎస్ నాయకులు వచ్చి అడ్డుకోబోయారు. ఈ సందర్భంగా కొంతమేర ఉద్రిక్తత నెలకొంది. బీజేపీ, బీఆర్ఎస్ నాయకుల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. ఇరు వర్గాలు తోపులాటకు దిగారు. ఈక్రమంలో హయత్‌నగర్ ఇన్‌స్పెక్టర్ నాగరాజుగౌడ్, వనస్థలంపురం సీఐలు అక్కడకు చేరుకుని బీఆర్ఎస్ నాయకులను అక్కడినుంచి అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్‌స్టేషన్‌కు తరలించి పరిస్థితిని శాంతింప చేశారు.



రఘువీర్‌రెడ్డిని స్టేషన్‌కు తరలిస్తున్న పోలీసులు

### ఎమ్మెల్యే నియంతలా వ్యవహరిస్తున్నాడు

బీఆర్ఎస్ నాయకులు తమపై దాడులకు దిగడం వెనుక ఎమ్మెల్యే హస్తం ఉందన్నారు. ప్రజా సమస్యలను గాలికి వదిలేసి చిల్లర రాజకీయాలు చేయడం మానుకోవాలన్నారు. నియోజకవర్గంలో సుధీర్‌రెడ్డి నియంతలా వ్యవహరిస్తున్నాడని కార్పొరేటర్లను చిన్నచూపు చూస్తూ ఎల్.బి.నగర్ నియోజకవర్గ కార్పొరేటర్లను అవమానాలను గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రశాంతమైన మన్సూరాబాద్ డివిజన్‌లో ఎమ్మెల్యేతో పాటు మాజీ కార్పొరేటర్ కొప్పుల విఠల్‌రెడ్డి, కుటిల రాజకీయాలు చేస్తూ డివిజన్‌లో శాంతి భద్రతలకు విఘాతం కల్గిస్తున్నారని ఆరోపించారు. ఇకనైనా ఎమ్మెల్యే వ్యవహార శైలిని మార్చుకుని కార్పొరేటర్లకు తగిన గౌరవం ఇచ్చి అభివృద్ధి విషయంలో కలుపుకుని పోవాలన్నారు. ఆరునెలల్లో అభివృద్ధి పనులను పూర్తిచేయడానికి సహకరించిన జోనల్ కమిషనర్, మేయర్, జీహెచ్ఎంసీ అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షులు ధర్మారావు, నరసింహ యాదవ్, కడారి యాదగిరి, రోహిత్, పరాంకుశం, కోటయ్య, రవి వీజేపీ డివిజన్ అధ్యక్షులు హరీష్‌రెడ్డి, నాయకులు రామేశ్వర్, ఆదిరానారాయణ, గజన్, కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

# స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు తగదు

**కుషాయిగూడ ,మార్చ్ 17, ప్రభాతవార్త**

స్పీకర్ శ్రీ గడ్డం ప్రసాద్ కుమార్ పట్ల బీఆర్ఎస్ ఎమ్మెల్యే దురుసు ప్రవర్తనను ఖండిస్తూ నిరసనగా. ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జి శ్రీ మందుముల పరమేశ్వర్ రెడ్డి ఆదేశాల మేరకు నియోజకవర్గంలో ప్రతి డివిజన్ -కాలనీ-బస్తీల్లో జగదీశ్ రెడ్డి దిష్టిబొమ్మ దహన కార్యక్రమాల్లో భాగంగా కాప్రా గాంధీనగర్ బస్టాప్ వద్ద జగదీష్ రెడ్డి దిష్టిబొమ్మ దహన కార్యక్రమం నిర్వహించి నిరసన వ్యక్తం చేసిన కాప్రా డివిజన్ కాంగ్రెస్ నాయకులు. కాప్రా డివిజన్ అధ్యక్షులు శ్రీ కొబ్బనూరి నాగేషు-మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ శ్రీ విఠల్ నాయక్ నేతృత్వం వహించగా కాంగ్రెస్ నాయకులు జి సత్యనారాయణ ఆధ్వర్యంలో కాప్రా గాంధీనగర్ లోని బొడ్రాయి ప్రాంగనం నుండి గాంధీనగర్ బస్టాప్ వరకు ర్యాలీగా వెళ్లి జగదీశ్ రెడ్డి దిష్టిబొమ్మ దహనము చేశారు. ఈ కార్యక్రమంలో కాప్రా కాంగ్రెస్ నాయకులు పడమటి మల్లారెడ్డి ,కొబ్బనూరి నాగరాజు, జి సత్యనారాయణ, శ్రీహరి ,షాబుద్దీన్ , డి ప్రభాకర్ , హరి ,ఏసుబాబు ,రాజు , లాజర్ , యూత్ కాంగ్రెస్ అధ్యక్షా- ఉపాధ్యక్షులు ప్రశాంత్ గౌడ్-జి అరుణ్ కిరణ్ , యూత్ సభ్యులు మనోజ్ ,అజయ్ , గౌతమ్ , ఇమ్రాన్ , బాలు, మహిళా కాంగ్రెస్ నాయకులు జి లక్ష్మి , జి అరుణ , దుర్గమ్మ , శైలజ ,రవళిక తదితరులు పాల్గొన్నారు.



జగదీశ్వర్ రెడ్డి దిష్టిబొమ్మ దగ్ధం చేస్తున్న దృశ్యం...

## హనుమాన్ దేవాలయంలో భక్తిశ్రద్ధలతో బ్రహ్మోత్సవాలు



ఉత్సవాలలో పాల్గొన్న చిలుక ఉపేందర్‌రెడ్డి

**ఎల్.బి.నగర్, మార్చి 17 ప్రభాతవార్త:** ఆర్కే పురం డివిజన్ పరిధిలోని శ్రీ రామకృష్ణపురం కాలనీలోని శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలు భక్తుల కోలహాల మధ్య భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉత్సవాలలోలో భాగంగా శ్రీసీతారామచంద్రస్వామి మూలమంత్ర సహిత మన్యుసూక్త హోమం, పూర్ణాహుతి, అన్నప్రసాద వితరణ కార్యక్రమంలో రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు చిలుక ఉపేందర్ రెడ్డి హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా దేవాలయం కమిటీ ఆయనను సత్కరించారు. ఈ కార్యక్రమంలో దేవాలయ దేవాదాయశాఖ అధికారిణి ఉమారాణి, జగిని రమేష్, తలాటి రమేష్‌నేత, శ్రీఖిల్లామైసమ్మ దేవాలయం చైర్మన్ సురేష్‌కుమార్, సాయికుమార్, రాజుశ్రీవాత్సవ్, లింగస్వామి, శ్యామ్‌సుందర్, హరీష్‌కుమార్, భగత్, మల్లేష్ పాల్గొన్నారు.

## ప్రజా సమస్యలను పరిష్కరించండి:పవన్



వినతి పత్రం అందజేస్తున్న పవన్‌కుమార్

**ఎల్.బి.నగర్, మార్చి 17 ప్రభాతవార్త:** ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించే విధంగా అధికారులు చర్యలు చేపట్టాలని కొత్తపేట డివిజన్ కార్పొరేటర్ ఎన్.పవన్‌కుమార్ విజ్ఞప్తి చేశారు. ఎల్బీనగ్ సర్కిల్ జలమండలి జిఎం బలరామ్‌ను కలిసి డ్రైనేజీ సమస్యలపై సోమవారం వినతి పత్రాన్ని కార్పొరేటర్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొత్తపేట డివిజన్ పరిధిలోని కాలనీలలో దశాబ్దాల క్రితం భూగర్భ డ్రైనేజ్ లైన్ వేశారని, నిత్యం డ్రైనేజీ మురుగు నీరు రోడ్లపైన పారుతుండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. పాడైపోయిన పాత డ్రైనేజీ వ్యవస్థను మార్చి నూతన డ్రైనేజీ లైన్ లను ఎర్పాటు చేయించాలని కోరారు. కాలనీలో నూతన త్రాగు నీటి లైన్ ఎర్పాటు చేయాలని అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో డిజిఎం రవీందర్ వర్మ, ఏఈ శ్రవంతిరెడ్డి, నాయకులు మంచి రాజేష్, రమేష్‌చారి తదితరులు పాల్గొన్నారు.

## ఉప్పల్, చిలుకానగర్ బిజెపి డివిజన్ అధ్యక్షుల నియామకం

**ఉప్పల్, మార్చి 17 ప్రభాతవార్త :**

ఉప్పల్ సర్కిల్ పరిధిలోని ఉప్పల్, చిలుకానగర్ డివిజన్ కమిటి అధ్యక్షులను సోమవారం ఎన్నుకున్నారు. ఉప్పల్ డివిజన్ అధ్యక్షునిగా బిజెపి సీనియర్ నేత మార్నేని పణీందర్, చిలుకానగర్ డివిజన్ అధ్యక్షునిగా బిజెవైఎం అధ్యక్షుడు డప్పు దత్తుసాయిలు నియమితులైయ్యారు. ఈ మేరకు బిజెపి జిల్లా ఎన్నికల అధికారి టి.అచారి ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో మార్నేని పణీందర్, దత్తసాయి మాట్లాడుతూ డివిజన్‌లో బిజెపి బలోపేతానికి తమ వంతు కృషి చేస్తామని తెలిపారు. పార్టీ కోసం పనిచేసే వారికి తగు గుర్తింపు ఇచ్చారని పేర్కొన్నారు. పార్టీని మరింత అభివృద్ధి చేసి వచ్చే ఎన్నికల్లో బిజెపి జెండా ఎగురవేస్తామని తెలిపారు. తమకు పదవి వచ్చేందుకు కృషి చేసిన నేతలకు వారు కృతజ్ఞతలు తెలిపారు.

## చిరు వ్యాపారి కుటుంబానికి అక్షిత ఫౌండేషన్ ఆసరా

**సరూర్‌నగర్, మార్చి 17 ప్రభాతవార్త:** మండుటెండలో రోడ్డు పక్కన చిరు వ్యాపారం చేసుకుంటున్న ఓ పేద కుటుంబానికి అక్షిత ఫౌండేషన్ అండగా నిలిచింది. మహేశ్వరం నియోజకవర్గంలోని బాలాపూర్ చౌరస్తా నుండి మిథాని వైపు వెళ్లే రహదారి పక్కన ముగ్గురు పిల్లలతో ఓ వ్యక్తి బొమ్మలు, బాళ్లు తదితర వాటిని అమ్ముకుంటున్న వైనాన్ని గమనించిన అక్షిత ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు రాపాక సన్నీ కుమార్ స్పందించారు. కుటుంబ ఆర్థిక పరిస్థితి బాగా లేదని తెలుసుకున్న సన్నీ అప్పటికప్పుడు చపాతి పిండి, వంట నూనె, చక్కెర, టీ పొడి తదితర నిత్యావసర సరుకులను తెచ్చి సదరు వ్యక్తి పిల్లలకు అందజేశారు. గత కొన్ని సంవత్సరాలుగా సామాజిక సేవలు చేస్తూ ఆభాగ్యులను ఆదుకుంటున్న అక్షిత ఫౌండేషన్ వ్యవస్థాపకుడు సన్నీని పలువురు అభినందించారు.

## పశు పక్ష్యాదుల పట్ల ప్రతి ఒక్కరూ కరుణ చూపాలి

### -ద్వారకామాయి పీఠాధిపతి గోపాలకృష్ణానంద స్వామీజీ



శునకానికి పుట్టిన రోజు నిర్వహించి కేకు తినిపిస్తున్న ద్వారకామాయి సాయిబాబా పీఠాధిపతి గోపాలకృష్ణానంద స్వామీజీ

**సరూర్‌నగర్, మార్చి 17 ప్రభాతవార్త:** పశు పక్ష్యాదుల పట్ల ప్రతి ఒక్కరూ జాలి, దయ కలిగి ఉండాలని ప్రథమ దత్తావతారమైన శ్రీపాద శ్రీవల్లభుల వంశంలో 34వ తరానికి చెందిన దత్త సిద్ధాంత ఆదికర్త, మీర్‌పేట్ ప్రశాంతిహిల్స్ శ్రీ ద్వారకామాయి సాయిబాబా పీఠాధిపతి పూజ్యశ్రీ గోపాలకృష్ణానంద స్వామీజీ పిలుపునిచ్చారు. పెంపుడు శునకాలతో పాటు వీధి శునకాలకు తన పీఠంలో ఆశ్రయం కల్పించి వాటి బాగోగులు చూస్తున్న స్వామీజీ ఆశ్రమంలో బ్లాకీ అనే శునకానికి పుట్టిన రోజు నిర్వహించారు. ఈ సందర్భంగా శునకంచే స్వామీజీ కేకు కట్ చేయించి తన స్వహస్తాలతో తినిపించి భూత దయ చాటారు. ఈ సందర్భంగా స్వామీజీ మాట్లాడుతూ మూగ జీవాలను హింసించరాదనీ వాటి పట్ల కరుణ చూపాలని అన్నారు. ప్రతి యేటా వేలాది రూపాయలతో తమ పీఠంలో శునకాలకు ఆహార వసతి కల్పిస్తున్నామని వెల్లడించారు. ఇటీవల తమ పీఠం పరిసరాల్లో గుర్తు తెలియని వారు విషాహారం పెట్టి వీధి శునకాలను చంపడం దారుణమనీ దీనికి పాల్పడిన వారిని భగవంతుడు క్షమించడమని ఆయన స్పష్టం చేశారు. కార్యక్రమంలో పీఠం మాతాజీ మల్లాది విజయశ్రీ, సాయి లలిత్‌కుమార్ పాల్గొన్నారు.

## కురుమల హక్కుల కోసం ఐక్యంగా ఉద్యమించాలి : బిజెపి



ఉప్పల్‌లో జరిగిన కురుమ మహిళా సాధికారత సదస్సులో పాల్గొన్న బిజెపి మహిళా మోర్చ అధ్యక్షురాలు డా.శిల్పారెడ్డి, రేవు కృష్ణయ్య తదితరులు

**ఉప్పల్, మార్చి 17 ప్రభాతవార్త :** కురుమల హక్కుల కోసం ఐక్యంగా ఉద్యమించాలని బిజెపి రాష్ట్ర మహిళా మోర్చ అధ్యక్షురాలు డా.శిల్పారెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం ఉప్పల్ జోన్ కురుమ సంఘం అధ్యక్షుడు రేవు కృష్ణయ్య, కార్యదర్శి పర్వతాలు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో బిజెపి మహిళా మోర్చ అధ్యక్షురాలు డా. శిల్పారెడ్డి, కార్పొరేటర్ ఎం.రజితరెడ్డి, బండారు నారాయణ, కొలుపుల నరసింహా, గొరిగె రమేష్, గొరిగె మల్లేష్, పెద్ద మల్లేష్, జన్ని రఘు, మైసయ్య, అమరేశ్వరి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కురుమలకు స్థానిక ఎన్నికల్లో జనాభా ప్రాతిపధికన సీట్లు కేటాయించాలని, ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. నామినేటెడ్ పదవుల్లో కురుమలకు ప్రాధాన్యత కల్పించాలని డిమాండ్ చేశారు. గొర్రెల కోసం డిడిలు కట్టిన వారికి వెంటనే గొర్రెలు ఇవ్వాలని ట్యాంక్‌బండ్‌పై దొడ్డి కొమరయ్య, చుక్క సత్తయ్య విగ్రహాలు ఏర్పాటు చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు కురుమ సంఘం నేతలు పాల్గొన్నారు.

## కాన్షీ రామ్ ఆశయ సాధనకు కృషి : దయానందరావు



కాన్షీరాం జయంతి ఉత్సవాలలో పాల్గొన్న దాగిల్ల దయానందరావు, అల్గోల రమేష్, శ్రీకాంత్ తదితరులు

**మలక్ పేట, మార్చి 17, ప్రభాతవార్త :** కాన్షిరాం ఆశయ సాధన కోసం కృషి చేయాలని బీఎస్పీ సెంట్రల్ కోఆర్డినేటర్ దాగిల్ల దయానందరావు పేర్కొన్నారు. బహుజన సమాజ్ వాదీ పార్టీ వ్యవస్థాపకుడు కాన్షీ రామ్ జయంతిని పురస్కరించుకుని మలక్ పేట లో బీఎస్పీ హైదరాబాద్ జిల్లా ఇన్చార్జ్ అల్గోల రమేష్ ఆధ్వర్యంలో కాన్షిరాం జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన దయానందరావు మాట్లాడుతూ కులాన్ని నిర్మూలిద్దాం బహుజన సమాజాన్ని నిర్మిద్దాం అనే లక్ష్యంతో పని చేసిన కాన్షిరామ్ ఆశయాలను ముందుకు తీసుకెళ్లడానికి అందరూ కృషి చేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బిఎస్పి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు శ్రీకాంత్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలకు మెరుగైన సేవలు అందించడానికి కృషి : వెంకన్న



పదోన్నతి పై బదిలీ అయిన వెంకన్నను సన్మానిస్తున్న ఉద్యోగులు

**మలక్ పేట ,మార్చి 17, ప్రభాతవార్త:** ఆర్టీసీ డిపోలో విధులు నిర్వహిస్తున్న వెంకన్న డిపో మేనేజర్ గా పదోన్నతి పొంది బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పలువురు ఆర్టీసీ ఉద్యోగులు సిబ్బంది ఆయనకు పుష్ప గుచ్చాలను అందజేసి శాలువాలతో ఘనంగా సన్మానించి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు మరుగైన సేవలు అందించడానికి కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు ఉద్యోగులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఆర్యవైశ్యుల మనోభావాలు దెబ్బతీయవద్దు

### -ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు అమరవాది లక్ష్మీనారాయణ

**సైదాబాద్, మార్చి 17 ప్రభాతవార్త:** బల్కంపేట నేచర్ క్యూర్ ఆసుపత్రికి దివంగత మాజీ ముఖ్యమంత్రి, మాజీ గవర్నర్ కొణిజేటి రోశయ్య పేరు పెడతామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించడం హర్షణీయమని తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు అమరవాది లక్ష్మీనారాయణ అన్నారు. నేచర్ క్యూర్ ఆసుపత్రికి కొణిజేటి రోశయ్య పేరు పెట్టడం హర్షణీయమని, అయితే పొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్సిటీ పేరు మార్చడాన్ని ఆయన తీవ్రంగా వ్యతిరేకించారు. సాయుధ పోరాట యోధుడు సురవరం ప్రతాపరెడ్డి పేరును వేరే దేనికైనా పెట్టాలని, ఆర్యవైశ్యుల మనోభావాలను దెబ్బతీసే విధంగా ప్రభుత్వం నిర్ణయాలు తీసుకోవద్దని ఆయన కోరారు.

## కర్మన్‌ఘాట్ హనుమాన్ దేవాలయంలో సామూహిక గణపతి హోమం



గణపతి హోమం నిర్వహిస్తున్న అర్చకులు

**సైదాబాద్, మార్చి 17 ప్రభాతవార్త:** సంకష్టహర చతుర్ధి సందర్భంగా కర్మన్‌ఘాట్ హనుమాన్ దేవాలయ ప్రాంగణంలోని మహాగణతి ఆలయంలో సామూహిక గణపతి హోమం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. అనంతరం దేవాలయానికి పూల అలంకరణ, పాలు, పెరుగు, ఆవుమేత, కూరగాయలు, టెంట్ సామాగ్రి సరఫరా హక్కుల నిమిత్తం దేవాదాయ శాఖ సహాయ కమీషనరు టి.శేఖర్ పర్యవేక్షణలో దేవాలయ కార్యనిర్వాహణాధికారి ఎన్.లావణ్య సమక్షంలో సీల్డ్ టెండరు ప్రక్రియ నిర్వహించారు. పూలు, పూల దండల సరఫరా, విద్యుత్ అలంకరణ, చలువ పందిళ్లు, స్టేషనరీ సరఫరా, ప్రింటింగ్, స్క్రాప్ సేకరణ టెండర్లు వాయిదా వేశారు.

## మండా సురేష్ గెలుపు కోసం కృషి చేయాలి



**కుషాయిగూడ, మార్చ్ 17,ప్రభాతవార్త :** లైన్స్ క్లబ్బులలో ఐక్యత పెంచుకొని సేవా కార్యక్రమాలు మరింత మెరుగుపరచుకోవాలని 326 డిస్టిక్ మాజీ గవర్నర్ హరీష్ రెడ్డి పేర్కొన్నారు. కాప్రా సర్కిల్ పరిధిలోని రాధిక చౌరస్తా స్వాగత్ గ్రాండ్ లో ఏర్పాటు చేసిన లైన్స్ క్లబ్ ల సమావేశంలో 320 సి వైస్ రెండవ డిస్టిక్ గవర్నర్గా పోటీ చేస్తున్న లయన్ డాక్టర్ మండా సురేష్ గెలుపు కోసం ఆయన బోర్డ్ కమిటీలతో సమావేశమై ఐక్యత రాగానికిశ్రీకారం చుట్టారు. హరీష్ రెడ్డి బోర్డు కమిటీ సభ్యుల కృషితో ఈ సందర్భంగా పోటీలో నిలబడి ఉన్న డాక్టర్ లక్ష్మీ మూర్తి లయన్ రూప రెడ్డి లు తమ నామినేషన్ను విరమించుకొని మండ సురేష్ విజయానికి మద్దతు పలికారు. ఈ కార్యక్రమంలో సీనియర్ మాజీ గవర్నర్లు సీనియర్ లైన్స్ సభ్యులు కేఎన్ రెడ్డి, భాస్కర్ రెడ్డి, రమేష్ లక్ష్మణ్, దత్తు, లయన్ నాగన్న, బొజ్జ రాఘవరెడ్డి,, డాక్టర్ మండా సురేష్,సురేష్ మాజీ కార్పొరేటర్ పావని రెడ్డి గారులయన్ ఆఫీసర్స్ లయన్ మెంబర్స్ తో పాటు భాగ్యనగర్ గ్రీన్ సిటీ లయన్స్ క్లబ్ మాజీ అధ్యక్షులు లయన్ జ్యోతిర్మయాచారి, అధ్యక్షులు రమాదేవి,సాయికుమార్, పూలపల్లి రామ్ యాదవ్, డాక్టర్ ఐల చెంద్రయ్య అసోసియేట్ ప్రొఫెసర్, మిట్టపల్లి విజయ్ గౌడ్, కలకొండ బిక్షపతి, మహంకాళి నర్సింహా చారి, విష్ణు సాయి ప్రసాద్, సాయి కుమార్ గౌడ్, సునీల్ చారి, ,తదితరులు పాల్గొన్నారు

## అబ్దుల్లాపూర్‌మెట్‌లో ఇసుక విక్రయ కేంద్రం ప్రారంభం



ఇసుక విక్రయ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రంగారెడ్డి

**అబ్దుల్లాపూర్‌మెట్, మార్చి 17 ప్రభాతవార్త:** దళారీ వ్యవస్థను అరికట్టి నిర్మాణదారులకు అతితక్కువ ధరలో ఇసుక అందుబాటులోకి తెచ్చేందుకు ప్రభుత్వం సాండ్‌బజార్ పేరుతో ఇసుకను విక్రయిస్తోందని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో అబ్దుల్లాపూర్‌మెట్ మండల కేంద్రంలో నెలకొల్పిన ఇసుక విక్రయ కేంద్రాన్ని కార్పొరేషన్ చైర్మన్ అనీల్, ఇబ్రహీంపట్న ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి సోమవారం ప్రారంభించారు. ఈసందర భంగా వారు మాట్లాడుతూ... రౌండ్ దిక్లాక్ ప్రజలకు అందుబాటులో ఉండేలా ధరల్లో వ్యత్యాసం లేకుండా రెండు రకాల ఇసుకను ఏడాది పూర్తి కాలం సరఫరా చేయనున్నట్లు వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో కొనసాగనున్న ఈ ఇసుక విక్రయ కేంద్రాన్ని నిర్మాణదారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో టీఎస్ఎండీసీ ఎండీ సుశీల్‌కుమార్, జనరల్ మేనేజరు రాజశేఖర్‌రెడ్డి, మైనింగ్ శాఖ ఏడీ నర్సిరెడ్డి, అబ్దుల్లాపూర్‌మెట్ తహశీల్దార్ సుదర్శన్‌రెడ్డి, ఎంపీడీఓ శ్రీవాణి పాల్గొన్నారు.

## పేద విద్యార్థుల కోసం స్వంత నిధులతో సహాయం



ఎస్ఎస్‌సీ మెటీరియల్‌ను విద్యార్థులకు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బిఎల్ఆర్, నాయకులు శాంతి సాయిజన్ శేఖర్ తదితరులు

**నాచారం, మార్చి 17 ప్రభాతవార్త :** పేద విద్యార్థుల కోసం స్వంత నిధులతో ఆర్థిక సహాయం, పుస్తకాల పంపిణీ వంటి కార్యక్రమాలను చేపడుతున్నట్లు ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. టీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు సాయిజెన్ శేఖర్ విజ్ఞప్తి మేరకు నాచారం డివిజన్ లోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలలో పదవ తరగతి చదువుతున్న విద్యార్థులకు ఎమ్మెల్యే ఉచితంగా ఎస్ఎస్‌సీ పరీక్షల మెటిరీయల్స్‌ను ఎమ్మెల్యే విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ నెల 21 నుంచి జరగబోయే పరీక్షల కోసం వెళ్లుతున్న వారికి పరీక్ష సామాగ్రిని ఉప్పల్ శాసనసభ్యులు బండారి లక్ష్మారెడ్డి చేతుల మీదుగా విద్యార్థులందరికీ ఎగ్జామ్ పాడ్ పెన్నులు, పెన్సిల్ షార్ప్నర్, రబ్బర్, స్కేల్ వంటి వస్తువులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఇందిరా స్కూల్ ప్రిన్సిపల్ అప్సర్, బారాసా నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## సిసి రోడ్డు పనులను పరిశీలించిన కార్పొరేటర్ పన్నాల



సీసీ రోడ్డు పనులను పరిశీలిస్తున్న కార్పోరేటర్ పన్నాల దేవేందర్ రెడ్డి

**నాచారం, మార్చి 17 ప్రభాతవార్త :** మల్లాపూర్ డివిజన్ పరిధిలోని నెహ్రూ నగర్ కాలనీ బ్లాక్ 3 లో రూ. కోటి ఇరవై లక్షల రూపాయలతో జరుగుతున్న సీసీ రోడ్డు పనుల నాణ్యత ప్రమాణాలను సోమవారం కార్పొరేటర్ పన్నాల దేవేందర్ రెడ్డి పరిశీలించారు. పనుల్లో నాణ్యత ప్రమాణాలను పాటించాలని ఆయన అధికారులు, కాంట్రాక్టర్‌కు సూచించారు. ఈ సందర్భంగా డ్రైనేజీ పైపులైన్ల మర మ్మతులు, మాన్ హోల్ ఛాంబర్ మరమ్మతులు ఏమైనా ఉంటే యుద్ధ ప్రాతిపదికన చేయాలని జలమండలి అధికారులను ఆదే శించారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ డీఈ రూపా, ఏఈ. శ్రవంతి, వర్క్ ఇన్స్పెక్టర్లు రామారావు, భిక్షపతి మరియు స్థానిక నాయకులు కటర్ల భాస్కర్, బాసిత్, ప్రకాష్, భూషనం శ్రీనివా స్, కాల్వల అంజి, రామంజి, దీపక్ సింగ్, ఉస్మాన్, రాపోలు శ్రీనివాస్ పాల్గొన్నారు.

## చిలుకేశ్వరస్వామి ఆలయానికి పూస అశోక్ విరాళం



చిలుకేశ్వర ఆలయానికి విరాళం అందజేస్తున్న పూస అశోక్, విజయలక్ష్మి తదితరులు

**ఉప్పల్, మార్చి 17 ప్రభాతవార్త :** చిలుకానగర్‌లోని చిలుకేశ్వర అంజనేయ, గాయత్రిమాత దేవాలయానికి స్థానిక నలంద విద్యాసంస్థ యజమాని పూజ విజయలక్ష్మి, అశోక్ రూ.5లక్షల విరాళం అందజేశారు. ఈ మేరకు ఆలయ కమిటి నేతలు దాసరి కృష్ణ, శంబు ప్రసాద్,కోశాధికారి పంతంగి అమృత్‌రావు, దేవసాని బాలచందర్, జెల్లి మోహన్, దేవాలయం అర్చకులు ఉదయ్ కుమార్ శర్మ, గోనె అంజయ్య, పాల్వంచ విఠల్, సంఘి స్వామియాదవ్, బోడ విద్యాసాగర్, శామీర్‌పేట చంద్రయ్య, ఆర్.బలరామ్, కావలి నరసింహ తదితరులకు సోమవారం చెక్ అందజేశారు. సోమవారం రూ.లక్ష చెక్ అందజేసినట్లు వారు తెలిపారు. ఆలయం అభివృద్ధికి తమ వంతు సహకారం అందిస్తా మని తెలిపారు. కార్యక్రమంలో పలువురు ఆలయ కమిటి నేతలు పాల్గొన్నారు.

## సుల్తాన్‌పూర్‌లో ఘనంగా ఇఫ్తార్ విందు

**సరూర్‌నగర్, మార్చి 17 ప్రభాతవార్త:** మహేశ్వరం నియోజకవర్గం బాలాపూర్ మండలంలోని సుల్తాన్‌పూర్ గ్రామంలో ఇఫ్తార్ విందు ఘనంగా జరిగింది. ఉపవాస దీక్షలు పాటించిన ముస్లింల కోసం స్థానిక మసీదులో ఇఫ్తార్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రార్థనల అనంతరం పండ్లు, ఖర్జూరాలు తీసుకొని దీక్షను విరమించారు. ఇఫ్తార్ విందుకు టిపిసిసి ప్రధాన కార్యదర్శి, బడంగ్‌పేట్ కార్పొరేషన్ మాజీ మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి హాజరయ్యారు.

## ఆటో దొంగ అరెస్ట్



నిందితుడిని అరెస్ట్ చేసిన చాదర్ ఘాట్ పోలీసులు

**మలక్ పేట ,మార్చి 17, ప్రభాతవార్త:** ఆటో దొంగను అరెస్ట్ చేసిన సంఘటన ఖాదర్ ఘాట్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం సైదాబాద్ కి చెందిన రాపిడో డ్రైవర్ మహ్మద్ హనీఫ్ ఖురేషి అక్బర్ బాగ్ లో ఆటోను దొంగతనం చేశారు. ఈనెల 16వ తేదీన సౌత్ ఈస్ట్ జోన్ టాస్క్ ఫోర్స్ పోలీసులు, చాదర్ ఘాట్ పోలీసులు అజంపురం క్రాస్ రోడ్స్ వద్ద వాహనాలను తనిఖీ చేస్తుండగా సరైన పత్రాలు లేక పోవడంతో పోలీసులు మహమ్మద్ హనీఫ్ ఖురేషి ని అదుపులోకి తీసుకుని విచారించగా ఆటోను దొంగలించినట్లు అంగీకరించాడు. దీంతో అతని వద్ద నుంచి దొంగలించిన ఆటోను స్వాధీనం చేసుకుని అరెస్ట్ చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.